## క్లుప్తంగా

### న్యాయస్థానం అనుమతితో నల్లగొండలో ధర్నా చేస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య, బండ నరేందర్‌రెడ్డి

**నార్కట్‌పల్లి :** న్యాయస్థానం అనుమతితో రైతు సమస్యలపై ఈ నెల 21 నల్లగొండలో మహాధర్నా చేస్తామని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. మహాధర్నాకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత ఉండడంతోనే అనుమతి ఇవ్వలేదని విమర్శించారు. రైతులను పూర్తిగా మోసం చేస్తూ ప్రజాపాలన సాగిస్తున్నామని మంత్రులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో బైరెడ్డి కరుణకర్‌రెడ్డి, యానాల అశోక్‌రెడ్డి, బొక్క భూపాల్‌రెడ్డి, సతీష్ ఉన్నారు.

### నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

**నల్లగొండ:** పట్టణంలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏడీఈ వేణుగోపాలాచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ లైన్ పనులు జరిగే ప్రాంతాలైన మిర్యాలగూడ రోడ్డు, ప్రకాశం బజార్, మాన్యంచెల్క ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

### ఆర్టిజన్స్ కార్మికుల నిరాహార దీక్ష

**నల్లగొండ టౌన్ :** విద్యుత్ సంస్థలో ఆర్టిజన్స్ కార్మికులను రెగ్యులర్ పోస్టుల్లోకి మార్చాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆర్టిజన్స్ జేఏసీ ఆధ్వర్యంలో స్థానిక విద్యుత్ ఎస్‌ఈ కార్యాలయం ఎదుట నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. 18 సంవత్సరాలుగా విద్యుత్ సంస్థలో విధులు నిర్వహిస్తున్న ఆర్టిజన్స్ కార్మికులను రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం స్పందించి ఆర్టిజన్స్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మురళి, సలీంపాషా, పి.శేఖర్, కేఎస్‌రెడ్డి, వి.లెనిన్, జే.లింగస్వామి, లింగారెడ్డి, ఉమాదేవి, రమ, అరుణ, నాగమణి, యాదమ్మ, యాదయ్య, శైలజ, సైదులు, చంద్రమౌళి, యాదగిరి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

### ముఖ్యమంత్రికి డిమాండ్ల ఉత్తరం పోస్టు

**నల్లగొండ టౌన్ :** ధర్మసమాజ్ పార్టీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మూడు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పోస్టు చేసినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తలారి రాంబాబు తెలిపారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.విద్యా సంస్థల్లో ప్రతిరోజూ విద్యార్థులు చదివే ప్రార్థన స్థానంలో భారత రాజ్యాంగ పీఠికను ప్రతిజ్ఞ చేయించాలనే డిమాండ్‌ను ముఖ్యమంత్రి అమలు చేయాలని కోరుతూ ఉత్తరం రాసినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు వెంకన్న, శంకర్, జగన్, ఎల్లయ్య, వినోద్, గిరి, నరహరి తదితరులు పాల్గొన్నారు.

### నల్లబ్యాడ్జీలతో నిరసన

**శాలిగౌరారం:** రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాములుపై దాడికి పాల్పడిన మతోన్మాదులను శిక్షించాలని కోరుతూ మండలంలోని పెర్కకొండారం జడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. కార్యక్రమంలో డీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేశం, ఉపాధ్యాయులు లింగారెడ్డి, రాములు, వెంకన్న, యాదగిరి, రమేశ్ పాల్గొన్నారు.

### పిల్లలను బడిలో చేర్పించాలి

**కేతేపల్లి:** బడిఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించాలని ఇనుపాముల జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ముషం వెంకటేశ్వర్లు తల్లిదండ్రులను కోరారు. సోమవారం మండలంలోని ఇనుపాములలో మల్లన్న గుట్ట, ఇటుక బట్టీల వద్ద విద్యాశాఖ ఆధ్వర్యంలో బడి బయట పిల్లలను గుర్తించే సర్వే నిర్వహించారు. ఇటుక బట్టీల వద్ద ఒడిశా రాష్ట్రం నుంచి వలస వచ్చిన ఇద్దరు పిల్లలను గుర్తించి స్థానిక పాఠశాలలో చేర్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కొంగర శోభన్, సీఆర్పీ మహేందర్ పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

**శాలిగౌరారం:** కొంతకాలంగా అనారోగ్య సమస్యతో బాధపడుతున్న స్నేహితుడికి తామున్నామంటూ సహచర మిత్రులు భరోసా కల్పించారు. ఇటీవలే కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స చేయించుకొని హైదరాబాద్‌లో విశ్రాంతి తీసుకుంటున్న మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన భూపతి నరేశ్‌కు కప్పల శ్రీనువాసులు నేతృత్వంలో అతని చిన్ననాటి స్నేహితులు సోమవారం రూ.25 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో కప్పల శ్రీనువాసులు, భూపతి రామకృష్ణ, లక్ష్మయ్య, శ్రీను, సైదులు, వెంకన్న, శ్రీకాంత్, నాగరాజు, వాసు, యాదగిరి, శంకర్, వినయ్ పాల్గొన్నారు.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
- తిప్పర్తి, కనగల్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు



కనగల్ - తిమ్మన్నగూడెం రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**తిప్పర్తి :** రైతు సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. తిప్పర్తి మండలంలోని పజ్జూరు గ్రామంలో ఏర్పాటు చేసిన పీఏసీఎస్ గోదాం, ఆరోగ్య ఉపకేంద్రం భవనాలను సోమవారం ఆయన ప్రారంభించారు. అదే విధంగా మండల కేంద్రంలో సహకార బ్యాంకు నూతన శాఖను ప్రారంభించారు. తిప్పర్తిలో రూ.60లక్షల నిర్మించనున్న గ్రామపంచాయతీ భవనానికి శంకుస్థాపన చేశారు. మండల కేంద్రంలో రూ.9కోట్లతో చేపడుతున్న సుందరీకరణ పనులను కలెక్టర్ ఇలా త్రిపాఠితో కలిసి పరిశీలించి మంత్రి మాట్లాడారు. రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వమే ఉచిత విద్యుత్ ఇచ్చిందని గుర్తు చేశారు. రైతు రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. ఈ నెల 26 నుంచి రైతులందరికీ రైతు భరోసా నిధులు జమ అవుతాయన్నారు. గ్రామ



తిప్పర్తి : డీసీసీబీ బ్రాంచిని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, కలెక్టర్ ఇలా త్రిపాఠి

సభలో నిర్ధారణ చేసి అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. రుణమాఫీలో జిల్లా ప్రథమ స్థానంలో ఉన్నట్లు కలెక్టర్ త్రిపాఠి పేర్కొన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి, డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, మాజీ జెడ్పీటీసీ పాశం రాంరెడ్డి, ఆర్డీఓ అశోక్‌రెడ్డి, నాయకులు బద్దం సుధీర్, చింతకుంట్ల రవీందర్‌రెడ్డి, యర్రమాద నరేందర్‌రెడ్డి, మాజి సర్పంచ్‌లు ,ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

**రోడ్ల అభివృద్ధికి పెద్ద పీట**

**కనగల్ :** మండల వ్యాప్తంగా రోడ్ల అభివృద్ధికి పెద్ద పీట వేస్తున్నట్లు మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సోమవారం కనగల్ నుంచి తిమ్మన్నగూడెం మీదుగా రూ.14కోట్లతో నిర్మించే రోడ్డు నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ కనగల్ మండలంలో రహదారుల అభివృద్ధికి రూ.100 కోట్లు మంజూరు చేసామని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తుందని మంత్రి పేర్కొన్నారు. అర్హులందరికీ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను వర్తింపజేస్తామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సందర్శించారు. విద్యార్థులకు మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.

**మృతుడి కుటుంబానికి పరామర్శ**

మండల పరిధిలోని దర్వేశిపురం గ్రామానికి చెందిన జినుకుంట్ల లింగయ్యగౌడ్ ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందగా ఆయన కుటుంబాన్ని మంత్రి పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో ఆర్డీఓ అశోక్ రెడ్డి, తహసీల్దార్ పద్మ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, జిల్లా నాయకులు దేవిరెడ్డి వెంకట్ రెడ్డి, భారత వెంకటేశం, గోలి జగాల్‌రెడ్డి, గుండె బోయిన భిక్షం, కూసుకుంట్ల రాజిరెడ్డి, దేప కర్ణాకర్ రెడ్డి, కెసాని వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేశాం

- 11 నెలల్లోనే రూ.వందల కోట్లు తెచ్చాం
- పాలకవర్గ చివరి సమావేశంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి

**నల్లగొండ టూటౌన్ :** రాజకీయాలకు అతీతంగా 11 నెలల కాలంలోనే వందల కోట్ల రూపాయలతో నీలగిరి పట్టణాన్ని అభివృద్ధి చేశామని మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం నీలగిరి మున్సిపల్ కార్యాలయంలోని సమావేశం మందిరంలో చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షత పాలకవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అమృత్ 2.0 స్కీం కింద అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, సీసీ రోడ్ల పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి సహకారంతో నల్లగొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నామని, ఎక్కడ కూడా పార్టీలు చూడకుండా పని చేశామన్నారు. తాగు నీటి ట్యాంకులు, పైప్‌లైన్ పనులు వేసవి నాటికి పూర్తి చేసి తాగు నీటిని ప్రతిరోజు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పానగల్ నుంచి చందనపల్లి వరకు కొత్తగా వీధి లైట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అధికారులు, ఉద్యోగులు బాధ్యతతో పనిచేసి అభివృద్ధి పనులు సకాలంలో జరిగేలా చూడాలన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత విషయంలో రాజీ లేకుండా వ్యవహరించాలని కోరారు. రోడ్ల వెంట ఉన్న డబ్బాల వల్ల రోడ్లు కుదించుకుపోయాయని, వాటిని తొలగించేందుకు కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న సభ్యులు మరోసారి విజయం సాధించి కౌన్సిల్‌కు రావాలని ఆకాంక్షించారు. చివరి పాలకవర్గ సమావేశం కావడంతో పలువురు కౌన్సిలర్లు ఐదేళ్ల పాలన, వార్డులకు నిధుల కేటాయింపు, అభివృద్ధి తదితర వాటిపై మాట్లాడారు. గత పాలకవర్గం హయాంలో మున్సిపాలిటీ నిధులను వృథా చేశారని పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగేళ్ల కాలంలో కంటే 11 నెలల సమయంలో వార్డుల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించారని కౌన్సిలర్లు చైర్మన్‌కు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్, ఈఈ రాములు, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో వైస్ చైర్మన్, కమిషనర్

# నార్కట్‌పల్లి మాజీ వైస్ ఎంపీపీ మృతి

- నివాళులర్పించిన మంత్రి కోమటిరెడ్డి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే

**నార్కట్‌పల్లి :** నార్కట్‌పల్లి మాజీ వైస్ ఎంపీపీ, సీపీఎం సీనియర్ నాయకుడు ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన కల్లూరి యాదగిరి (60) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతిచెందారు. సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం తదితరులు ఎల్లారెడ్డిగూడెంలో యాదగిరి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. వీరి వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బత్తుల ఉషయ్య, వడ్డె భూపాల్‌రెడ్డి, బండ సాగర్ రెడ్డి, దూదిమెట్ల సత్తయ్య, పాశం శ్రీనివాస్‌రెడ్డి, సట్టు సత్తయ్య, భరత్, అచ్చాలు, వెంకన్న ఉన్నారు.

**పలువురి నివాళి**

యాదగిరి మృతదేహానికి మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మాజీ ఎంపీపీ సూదిరెడ్డి నరేందర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పుల్లెంల ముత్తయ్య, అచ్చాలు, మల్గ బాలకృష్ణ, గోసుల భద్రచలం, దూదిమెట్ల వెంకటేశ్వర్లు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.



నివాళులర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

**యాదగిరి మరణం పార్టీకి తీరని లోటు**

నార్కట్‌పల్లి మాజీ వైస్ ఎంపీపీ కల్లూరి యాదగిరి మరణం పార్టీకి తీరని లోటని సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు, ఎమ్మెల్సీ అల్లుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. వారు ఎల్లారెడ్డిగూడెంలో ఆయన మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నిర్వహించిన అంతిమయాత్రలో పాల్గొన్నారు. అంతిమ యాత్రలో చెరుపల్లి సీతారాములు, ఎమ్మెల్యే వేముల వీరేశం, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, తుమ్మల వీరారెడ్డి, మహమ్మద్ జహంగిర్, చింతపల్లి బయన్న, చెరుకు పెద్దులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి నీలగిరిలో వార్డు సభలు

**నల్లగొండ టూటౌన్ :** ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం నుంచి నీలగిరి పట్టణంలో వార్డు సభలు నిర్వహించనున్నారు. ఈ నెల 21వ తేదీ నుంచి ఈ నెల 25 వరకు వార్డు సభలు నిర్వహించనున్నారు. నీలగిరి మున్సిపాలిటీలో 48 వార్డులు ఉన్నాయి. నాలుగు రోజుల్లో 48 వార్డుల్లో అధికారులు వార్డు సభల నిర్వహించి అర్జీలు స్వీకరించనున్నారు. రోజుకు 12 వార్డుల్లో వార్డు సభలు నిర్వహించి లబ్ధిదారుల ఎంపికతోపాటు కొత్తగా దరఖాస్తులు కూడా స్వీకరించనున్నారు. మొదటి రోజు 1 నుంచి 12వ వార్డు వరకు, 22వ తేదీన 13వ వార్డు నుంచి 24వ వార్డు వరకు, 23వ తేదీన 25వ వార్డు నుంచి 36వ వార్డుకు వరకు వార్డు సభలు నిర్వహించనున్నారు. చివరి రోజు 24వ తేదీన 37వ వార్డు నుంచి 48వ వార్డు వరకు ఆయా వార్డుల్లోని ముఖ్య కూడళ్లలో గానీ, కమ్యూనిటీ హాల్స్‌లో ఈ సభలు నిర్వహించడానికి మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేశారు. వార్డు సభలో ఇద్దరు వార్డు ఆఫీసర్లు, ఒక నోడల్ ఆఫీసర్, ఆర్పీ, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొంటారని మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ తెలిపారు. వార్డు సభలను కలెక్టర్ తనిఖీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# సాగుకు యోగ్యం కాని భూముల గుర్తింపు

- చిట్యాల మండలంలో 947 ఎకరాలు

**చిట్యాల:** రైతు భరోసా పథకానికి లబ్ధిదారుల ఎంపికకు వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు ఇటీవల నిర్వహించిన క్షేత్రస్థాయి పరిశీలనలో చిట్యాల మున్సిపాలిటీ, మండల వ్యాప్తంగా 18 గ్రామ పంచాయతీల్లో సాగుకు యోగ్యం కాని భూములను గుర్తించారు. సాగుకు యోగ్యం కానివి 947 ఎకరాలున్నట్లు అధికారుల గణంకాలు పేర్కొంటున్నారు. అందులో చిట్యాల మున్సిపాలిటీలో 256 ఎకరాలు, ఏపూరులో 56.02, చిన్నకాపర్తిలో 32, గుండ్రాంపల్లిలో 45.38 , నేరడలో 136.01, పెద్దకాపర్తిలో 131.01, పేరేపల్లిలో 22.05, సుంకేనపల్లిలో 26.36, తాళ్లవెల్లెంలలో 7.37, ఉరుమడ్లలో 8, వనిపాకలలో 121, వెలిమినేడులో 104.15, వట్టిమర్తిలో 15, ఎలికట్టెలో 14ఎకరాల సాగుకు యోగ్యం కాని భూములు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అదే విధంగా సాగుకు యోగ్యంగా 46,853 ఎకరాలున్నట్లు అధికారులు తెలిపారు.

# భూములు తిరిగి ఇప్పించాలని ధర్నా



వినతిపత్రం అందజేస్తున్న తాటికల్ వాసులు

**నకిరేకల్ :** గ్రామానికి చెందిన కొందరు తమ భూములు ఆక్రమించుకున్నారని, తమకు భూములు తిరిగి ఇప్పించి హద్దులు చూపాలని తాటికల్ గ్రామానికి చెందిన ఎస్టీ కులస్తులు సోమవారం నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ముందుగా వారు నల్లగొండలో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం నకిరేకల్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ జుమురుద్దీన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాటికల్‌లోని 120 ఎస్టీ కుటుంబాలకు 2004 సంవత్సరంలో ప్రభుత్వం సర్వే నెంబర్ 286లో 30 ఎకరాల అసైన్డ్ భూములను ఒక్కో కుటుంబానికి 10 గుంటల చొప్పున పట్టాలు ఇచ్చిందని తెలిపారు. ఈ భూమిని గ్రామానికి చెందిన కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని ఆరోపించారు.

# పీఏసీఎస్ ఆధ్వర్యంలో పెట్రోల్ బంకు ఏర్పాటు

- పూర్తికావస్తున్న నిర్మాణ పనులు

**చిట్యాల:** మండలంలోని వెలిమినేడు గ్రామంలోని బొంగోనిచెర్వు గ్రామానికి వెళ్లే దారిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న పెట్రోల్‌బంకు నిర్మాణ పనులు పూర్తికావస్తున్నాయి. నాలుగేళ్ల క్రితం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఐఓసీ పెట్రోల్‌బంకు నిర్మాణ పనులను ప్రారంభించారు. అనుమతులు లేకపోవటంతో నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతూ వస్తుంది. నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సహకారంతో పెట్రోల్ బంకు నిర్మాణ పనుల అనుమతులను పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులు తీసుకువచ్చారు. దీంతో బంకు నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని, కొద్ది రోజుల్లో పెట్రోల్ బంకు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆ పీఏసీఎస్ మాజీ చైర్మన్, ప్రస్తుత డైరెక్టర్ పిశాటి భీష్మారెడ్డి సోమవారం పేర్కొన్నారు. ఆయన పెట్రోల్‌బంకు నిర్మాణ పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పెట్రోల్‌బంకు నిర్మాణం పూర్తయిన వెంటనే ప్రారంభానికి పీఏసీఎస్ సీఈఓ ఏర్పాట్లు చేయాలని కోరారు. బంకు ఏర్పాటుతో పీఏసీఎస్‌కు అదనపు ఆదాయం పెరగటంతో పాటు పలు గ్రామాల వాహనాదారులకు సౌకర్యంగా ఉంటుందన్నారు.



పెట్రోల్ బంకు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న పీఏసీఎస్ డెరెక్టర్ పిశాటి భీష్మారెడ్డి

# గ్రామ సభలను సమర్థంగా నిర్వహించాలి

**రామగిరి(నల్లగొండ):** గ్రామ సభలను సమర్థంగా నిర్వహించాలని ఎంపీడీఓ ఎస్.వెంకట్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఈ నెల 21 నుంచి 24 వరకు జరిగే గ్రామ సభలపై సోమవారం నల్లగొండ ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్, నోడల్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సయ్యద్ ముస్తాక్ అహ్మద్, తహసీల్దార్ శ్రీనివాస్, ఏఓ శ్రీనివాస్ పాల్గొన్నారు.

**గ్రామ సభల్లో దరఖాస్తులు స్వీకరించండి**

**మునుగోడు:** గ్రామ సభల్లో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తులు అందిస్తే వాటిని తీసుకోవాలని ఎంపీడీఓ శాంతకుమారి సిబ్బందికి సూచించారు. గ్రామ సభలపై టీం లీడర్లతో పాటు సిబ్బందికి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన కల్పించారు. సమావేశంలో సూపరింటెండెంట్ విజయ భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ ఎన్.నరేష్, పంచాయతీ అధికారి స్వరూపరాణి పాల్గొన్నారు.

**నేటి నుంచి గ్రామసభలు**

**చిట్యాల:** ప్రభుత్వ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారం (21వ తేదీ) నుంచి 24వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నట్లు చిట్యాల ఎంపీడీఓ ఎస్‌పీ.జయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామసభల్లో ఆయా పథకాల లబ్ధిదారుల ఎంపికతో పాటు దరఖాస్తులు స్వీకరించనున్నారు.



తిప్పర్తిలో మాట్లాడుతున్న ఆర్డీఓ అశోక్‌రెడ్డి

**కేతేపల్లి:** రైతు భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు ఈనెల 21 నుంచి 24 వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ బి.శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

**పకడ్బందీగా నిర్వహించాలి**

**తిప్పర్తి :** గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన తిప్పర్తి తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. అర్హులకు ప్రభుత్వ పథకాలు వర్తించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ స్వప్న ఉన్నారు.

**చండూరు :** ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం జరిగే గ్రామ సభలను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని చండూరు ఎంపీడీఓ రాంరెడ్డి సూచించారు. చండూరు మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో జరిగిన సమావేశంలో ఎంపీఓ మాధవరెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు.

**కట్టంగూర్ :** రైతు భరోసా, ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డుల పంపిణీకి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక కోసం ఈ నెల 21 నుంచి 24వ తేదీ వరకు గ్రామ సభలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా పరిశ్రమల శాఖ జేడీ కోటేశ్వర్‌రావు సూచించారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో పలు శాఖల అధికారులత నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు ఉన్నారు.

**శాలిగౌరారం:** మండలంలో నేటి నుంచి ఈనెల 24 వరకు గ్రామసభలు జరుగనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ సుధాకర్ సోమవారం తెలిపారు.

**మర్రిగూడ:** మండలంలోని అన్ని గ్రామపంచాయతీల్లో 24వరకు గ్రామ సభలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జి.చినమునయ్య సోమవారం తెలిపారు.

### హామీల అమలులో విఫలం

**నకిరేకల్ :** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ నలగాటి ప్రసన్నరాజ్ ఆరోపించారు. నకిరేకల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల సమస్యలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నల్లగొండలో నిర్వహించతలపెట్టిన రైతు మహాధర్నాకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రుణమాఫీ పూర్తిస్థాయిలో జరగలేదన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చల్లా కృష్ణారెడ్డి, యల్లపురెడ్డి సైదిరెడ్డి ఊట్కూరి ఏడుకొండలు, నూక సైదులు, గుండాల మల్లేష్‌గౌడ్, చిట్యాల రాజిరెడ్డి, యాదయ్య, పాల్గొన్నారు.

### మాజీ ఎంపీపీ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

**కట్టంగూర్ :** మండలంలోని పిట్టంపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ కొండ లింగస్వామిగౌడ్ తండ్రి శంకరయ్య(74) ఆదివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. నకరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సోమవారం శంకరయ్య మృతదేహంపై పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా అయిటిపాములకు చెందిన నర్సింహాచారికి చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిజ్ పేలి ఇల్లు కాలిపోగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10 వేల నగదు అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీలు సుంకరబోయిన నర్సింహ, మాద యాదగిరి, పెద్ది సుక్క య్య, పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న నాటి విద్యార్థులు, ఉపాధ్యాయులు

**నల్లగొండ టౌన్:** నల్లగొండ మండలంలోని దోమలపల్లి జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన 1998–99 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు సోమవారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థులు తమ గురువులను సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.వెంకట్ రెడ్డి, కమిటీ సభ్యులు పుట్ట మోహన్‌రెడ్డి, శైలేందర్, రమేష్‌చంద్ర, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

**మృతురాలి కుటుంబానికి పరామర్శ**

**కనగల్:** మండల పరిధిలోని జి.యడవల్లి గ్రామానికి చెందిన కర్నాటి మారెమ్మ సోమవారం అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందింది. కనగల్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గడ్డం అనూప్‌రెడ్డి మారెమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించాడు. ఆయన వెంట కర్నాటి పెద్దగిరి, బొడ్డుపల్లి శ్రీను, వెంకన్నగౌడ్, పర్సనబోయిన వెంకటేశం, గౌని నరేష్, స్వామి, పాల్గొన్నారు.

**నేరడలో మదర్సా నిర్వహణపై ఫిర్యాదు**

**చిట్యాల:** మండలంలోని నేరడ గ్రామంలో అనుమతులు లేకుండా మదర్సా నిర్వహణపై ఆ గ్రామస్తులు గణేష్, రమేష్, హరికృష్ణ, నర్సింహ సోమవారం గ్రీవెన్స్ డేలో కలెక్టర్ ఇలా త్రిపాఠికి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు చిట్యాల తహసీల్దార్ కృష్ణానాయక్, ఎస్ఐ ధర్మా నేరడలో నిర్వహిస్తున్న మదర్సాను పరిశీలించారు.

**హ్యాండ్ బాల్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ**

**నకిరేకల్ :** కరీంనగర్‌లో ఈ నెల 18 నుంచి 20 వరకు జరిగిన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ టోర్నమెంట్‌లో నకిరేకల్‌లోని ఏవీఎం పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థి జటావత్ కృష్ణుడు ఉత్తమ ప్రతిభ చూపాడు. గవిద్యార్థి కృష్ణుడిని విద్యాసంస్థల అధినేత కందాల పాపిరెడ్డి, ప్రిన్సిపాల్ కందాల స్వప్నారెడ్డి, అడ్మినిస్ట్రేటర్ శ్రీకాంత్‌రెడ్డి, జితేందర్, పీడీ నిమ్మల శంకర్‌గౌడ్ అభినందించారు.

**ముగిసిన క్రికెట్ పోటీలు**

**చండూరు :** మున్సిపాలిటీ కేంద్రంలో వార్డుల వారీగా నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ సోమవారం ముగిసింది. 8వ వార్డు టీం మొదటి బహుమతి, ఒకటో వార్డు టీం ద్వితీయ బహుమతి, 9వ వార్డు టీం తృతీయ బహుమతి గెలుపొందింది. విజేతలకు మాజీ ఎంపీపీ, 8వ వార్డు కౌన్సిలర్ తోకల వెంకన్న, భూతరాజు దశరథ బహుమతులు అందించారు. కార్యక్రమంలో గండూరి నగేష్, గండూరి జనార్దన్, మాజీ వార్డు మెంబర్ కారింగు యాదయ్య, నక్కపోతు సురేష్, తమ్ముడగోని మల్లేష్, పిట్టల రాంబాబు, వేణు పాల్గొన్నారు.

## సంక్షిప్త సమాచారం

**శివలీలకు సంక్రాంతి పురస్కారం**

**కనగల్ :** మండల కేంద్రానికి చెందిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ అవార్డు గ్రహీత కంబాల శివలీలరెడ్డి చేస్తున్న సమాజ సేవను గుర్తించి సోమవారం కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో ఆర్యాణి కళావేదిక సంస్థ అధ్యక్షుడు శ్రీధర్ సంక్రాంతి పురస్కాం, వైద్యరత్న అవార్డులను అందించారు.

**రైతుల ప్రయోజనాలే మార్కెట్ కమిటీ లక్ష్యం**

**శాలిగౌరారం:** రైతుల ప్రయోజనాలే లక్ష్యమని శాలిగౌరారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాదూరి శంకర్‌రెడ్డి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన నూతన పాలకవర్గం సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ తాళ్లూరి మురళి, మార్కెట్ కార్యదర్శి చీనానాయక్, మార్కెట్‌కమిటీ వైస్ చైర్మన్ నరిగె నర్సింహ, డైరెక్టర్లు కూతాటి సోములు, పడాల రమేశ్, తాందారు సత్తయ్య, షేక్ లతీఫ్, బోడ దానయ్య, దేవరకొండ జయరాజు, అవిలయ్య, బండపల్లి అంజమ్మ, రాజుల శ్రీనివాస్, లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు.

**25 నుంచి సీపీఎం రాష్ట్ర మహాసభలు**

**కట్టంగూర్ :** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో ఈ నెల 25 నుంచి 28 వరకు జరిగే సీపీఎం తెలంగాణ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి పెంజర్ల సైదులు పిలుపునిచ్చారు. సోమవారం కట్టంగూర్‌లో సీపీఎం నాయకులతో కలిసి రాష్ట్ర మహాసభ పోస్టర్‌లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. చిలుముల రామస్వామి, మురారి మోహన్, ఇటుకల సురేందర్, కట్ట బక్కయ్య, జాల రమేష్, జాల ఆంజనేయులు, చిలుకూరి సైదులు ఉన్నారు.

**కరాటేలో ప్రతిభ**

**నకిరేకల్ :** హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఈ నెల 18 నుంచి 20 వరకు నిర్వహించిన జపాన్ కరాటే అసోసియేషన్ ఇండియా 50 వ జాతీయ కరాటే పోటీల్లో నకిరేకల్‌కు చెందిన కరాటే మాస్టర్లు ఉత్తమ ప్రతిభ చూపారు. జపాన్ హెడ్ క్వార్టర్ మాస్టర్స్ ఇమురాషీహన్, హిరోషి, తనిమియా సిహన్‌ల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలను అందుకున్నారు. నకిరేకల్‌కు చెందిన అలువాల అంజి అంతర్జాతీయ బ్లాక్ బెల్ట్ మొదటి డిగ్రీ సర్టిఫికెట్ అందుకున్నారు. అంతటి సోములుగౌడ్, ఆర్.విజయ్‌కుమార్, ఎం.సత్యరాజు, కృష్ణ,సాయి శివ ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

**కాంగ్రెస్ నాయకుల నివాళి**

**శాలిగౌరారం:** మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుండ్ల నర్సింహ(70) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం సాయంత్రం మృతిచెందాడు. సోమవారం నర్సింహ మృతదేహాన్ని కాంగ్రెస్ నాయకులు సందర్శించి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు రూ.11 వేల నగదు అందజేశారు. వారిలో సింగిల్‌విండో వైస్‌చైర్మన్ చామల మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కూతాటి సోములు, తాందారు సత్తయ్య, నాయకులు చింత ధనుంజయ్య, పరమేశ్, శ్రీనువాసులు ఉన్నారు.

**నేడు జిల్లా స్థాయి పోటీలు**

**రామగిరి(నల్లగొండ):** ప్రభుత్వ పాఠశాలల్లో 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఇంగ్లిష్ భాషపై నైపుణ్యం పెంచేందుకు ఎల్టా (తెలంగాణ ఆంగ్ల భాషోపాధ్యాయుల సంఘం), ఎస్‌సీఈఆర్‌టీ, భారతి ఫౌండేషన్ సంయుక్తంగా నల్లగొండలోని డైట్‌లో మంగళవారం జిల్లా స్థాయి ఇంగ్లిష్ ఒలింపియాడ్, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్బాస్ అలీ, బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు ఉపాధ్యాయులతో హాజరుకావాలని కోరారు.